ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





వెళ్లొద్దాం.. జగ్గన్నతోట

రేపే తీర్థం 8

కో..ఢీ



ఐ.పోలవరం మండల కేంద్రంలో సాగుతున్న పందెం

కోళ్లతో ఎమ్మెల్యే బండారు, రెడ్డి సుబ్రహ్మణ్యం

బరితెగింపు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కత్తులు దూసిన కోళ్లు
- 1140 బరులపైనే - రూ.175 కోట్ల లావాదేవీలు
- గుండాట జోరు - రాజానగరంలో బాల్ ఆట
- చాలా ప్రాంతాల్లో బహుమతులుగా బుల్లెట్లు
- కరపలో మూడు రోజుల విజేతకు థార్ జీప్
- హైకోర్టు కాదన్నా..పోలీసులు వద్దన్నా ఆగలేదు..



అమలాపురం మండలం కామనగరువులో కోళ్ల కొట్లాట

బరితెగించారు.. క్రికెట్ స్టేడియాలను తలపించేలా బరులు వెలిశాయి.. పోలీసులు కాదన్నా.. హైకోర్టు వద్దన్నా బరులు వేశారు.. కోళ్లకు కత్తులు కట్టారు.. పందెంరాయుళ్ల పంతాలతో పోటీలు పోటెత్తాయి. ఎక్కడికక్కడ బరుల్లో పుంజులు హోరాహోరీగా పోరాడాయి.. అటు పందాల పక్కనే గుండాటలు జోరందుకున్నాయి. లక్షలకు లక్షల పందాలతో హోరాహోరీగా సాగాయి.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జిల్లాలో తొలిరోజు 1140 బరులు వెలిశాయి. మొత్తం 175 కోట్ల లావాదేవీలు జరిగాయి. కోడి పందాలకు హైకోర్టు అనుమతి నిరాకరించినా బరితెగించి ఆడేశారు. అయినా ఏ ఒక్కరూ అటువైపే కన్నెత్తి చూడలేదు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కోళ్ల కొట్లాట ఆడుకున్నాయి.. నువ్వా నేనా అంటూ పోటీపడ్డాయి.. ఎక్కడా వెనక్కు తగ్గలేదు.. చివరి శ్వాస వరకూ పోరాడాయి. వేలాది పుంజులు బరిలోనే ప్రాణాలు విడిచాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జిల్లాలో తొలిరోజు కోడి పందాలు, గుండాటలు హోరెత్తాయి. కాకినాడ జిల్లావ్యాప్తంగా సోమవారం దాదాపు 410 చోట్లకు పైగా బరులు వెలిశాయి. ఒక్కో బరిలో రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు లావాదేవీలు జరిగాయి. తొలి రోజు రూ.65 కోట్లకుపైగా పందాలు, ఇతర బెట్టింగ్‌లు జరిగాయి. ఒక్కో బరి వద్ద మూడు నుంచి నాలుగు వరకు గుండాట బోర్డులతో వ్యాపారం జరిపారు. ప్రధానంగా కాకినాడ రూరల్, కరప మండలాల్లో రూ.25 కోట్ల వరకు కోడిపందాలు, గుండాట వ్యాపారం జరిగింది. బరుల్లో భారీ షామియానాలు, మైక్ సెట్‌లు, పెన్సింగ్ ఏర్పాటుచేసి మరీ పందాలు నిర్వహించారు. జిల్లాలో ఆ చివర తుని నుంచి ఈ చివర తాళ్లరేవు వరకు భారీగా పందేలు జరిగాయి. టీడీపీ, జనసేన నేతలు ఎవరికి వారు పోటాపోటీగా బరులు నిర్వహించి పందాలు ఆడించారు. పిఠాపురంలో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ వేర్వేరు ప్రాంతాల్లో కోడిపందాలు ప్రారంభించి తిలకించారు. కరప మండలంలో రూ.36 లక్షలకు వేలంలో బరి దక్కించుకున్న నిర్వాహకులు తొలిరోజు రూ.10 కోట్లకు పైగా పందాలు నిర్వహించారు. పండగకు ముందురోజు బరులు ధ్వంసం చేసిన పోలీసులు సోమవారం కన్నెత్తిచూడలేదు.

కోనసీమలో రూ.60 కోట్లు ఆడేశారు..

అమలాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ముసుగులో కోడిపందాలు, గుండాటలు, పేకాట సోమవారం జోరుగా ప్రారంభమయ్యాయి. ప్రజాప్రతినిధులే దగ్గరుండి పందెం బరులను ప్రారంభించడంతోపాటు పోటీలను తిలకించి విజేతలకు బహుమతులు అందించారు. టీడీపీ, జనసేన కూటమి నేతలకు పందెం బరులు ఉపాధి మార్గాలుగా మారాయి. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫార్సులతో పార్టీ నేతలే కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకుని బరులు నిర్వహించడానికి అనుమతులు తీసుకుని వాటిని వేరే వ్యక్తులకు విక్రయించడం ద్వారా లక్షలాది రూపాయలు లాభాలుగా ఆర్జించిన సంఘటనలు ఉన్నాయి. పోలీసు యంత్రాంగం మామూళ్ల మత్తులో అటువైపు కన్నెత్తి చూడలేదు. కోనసీమ జిల్లా మురమళ్లలో వీఐపీ బరిని ఏర్పాటుచేశారు. ఇక్కడ రూ.5 లక్షలు, రూ.10 లక్షల పందాలు జరుగుతుండగా, వాటిపై బయటి పందాలు కోట్ల రూపాయల్లో వేస్తున్నారు. ఇక్కడ విజేతలైన వారికి మెమెంటోతోపాటు చిరు కానుకలు సైతం అందించి సత్కరిస్తున్నారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, వైసీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానందలతో పాటు అనేకమంది ముఖ్య నేతలు ఈ బరిలో జరిగే కోడి పందాలను వీక్షించారు. చెయ్యేరు, గెద్దనపల్లిలో కూడా భారీగా కోడిపందాలు, గుండాటలు జరుగుతున్నాయి. సంక్రాంతి సంబరాల పేరిట ఎస్.యానాంలో జరుగుతున్న ఉత్సవాల్లో సైతం కోడి పందాలు, గుండాటలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా తొలిరోజు సుమారు రూ.65 కోట్ల మేర పందాలు, గుండాటలు జరిగినట్టు తెలిసింది. అమలాపురం పట్టణంలోని బైపాస్ రోడ్డు, వెంకటేశ్వరస్వామి గుడి వద్ద గుండాటలు వేశారు. కొంకాపల్లి సత్తెమ్మ చెట్టు వద్ద ప్రైవేటు సెక్యూరిటీ మధ్య పేకాట పోటీలు నిర్వహిస్తున్నారు. ఆత్రేయపురం మండలం లొల్లలో జోడు పందాలు గెలుచుకునే విజేతకు బుల్లెట్లు బహుమతులుగా ఇచ్చేందుకు సిద్ధం చేశారు. కామనగరువులో కూడా ఓ బుల్లెట్ సిద్ధంచేశారు. చాలా బరుల వద్ద నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుని పందాలు నిర్వహించడం చర్చనీయాంశమైంది. అల్లవరం, ఉప్పలగుప్తం మండలంలోని కొన్ని ప్రాంతాల్లో బరులు వెలవెలబోయాయి. సాకుర్రు గున్నేపల్లి బరి వద్ద ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడిపోయి ఉండడం అక్కడ కలకలం రేపింది. రామచంద్రపురం, మండపేట పట్టణ పరిసరాలతో పాటు రావులపాలెం, కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో పందాలు, గుండాటలు యథేచ్ఛగా జరిగాయి. రాజోలు నియోజకవర్గ పరిధిలోని కేశనపల్లి, గూడపల్లిలలో రికార్డింగు డ్యాన్సులు ప్రారంభమైన కొన్ని గంటల్లోనే పోలీసులు జోక్యం చేసుకుని నిలిపివేశారని సమాచారం.



రావులపాడులో ఇలా...

ఇదండీ సంగతి..

- కరపలో నిర్వహించే కోడిపందాల్లో ప్రతిరోజు విజేతకు రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. రోజు మొత్తం జరిగే పందాల్లో ఎక్కువ పందాలు గెలిస్తే బుల్లెట్ ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఇదే బరిలో మూడు రోజులపాటు జరిగే పందాల్లో ఎక్కువ పందాలు గెలిచిన విజేతకు థార్ జీపు ఇస్తామని బరి వద్దే ఉంచి ప్రదర్శించారు. దీంతో తెగ పోటీపడ్డారు. అమలాపురం మండలం కామగరువు, కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో కూడా ఎక్కువ పందాలు గెలిచిన వారికి బుల్లెట్లు ఇస్తామని బరి వద్ద ప్రదర్శించారు.
- కోడిపందాల్లో సాధారణంగా ఓమోస్తరు బరిలో ఒక్కో పందెం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ వెళ్లింది. అంటే రూ.50 వేల పందెంలో రెండు పుంజుల యజమానులు చెరో రూ.50 వేలు కట్టాలి. కత్తులు కట్టినందుకు, బరి నిర్వహణకు మొత్తంలో 10 శాతం ఇవ్వాలి. రూ.లక్ష పందెం జరిగితే రూ.10 వేలు నిర్వాహకులకు ఇవ్వవలసిందే. గుండాటలు, కలర్‌బాల్స్ జూదం వంటి వాటి నిర్వహణకు ప్రాంతాన్ని బట్టి రూ.7 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ నిర్వాహకులకు చెల్లించాలి.
- కోడిపందాల బరులు, గుండాట వద్ద ఫైనాన్స్ వ్యాపారులు డైలీ ఫైనాన్స్ కింద పందెం రాయుళ్లకు అప్పులిచ్చారు. బంగారం ఉంచుకుని రూ.లక్ష నుంచి రూ.5 లక్షల దాకా జగ్గంపేట, కరప, కాకినాడ రూరల్ ప్రాంతాల్లో అప్పులిచ్చారు.
- నిర్వాహకులతో ఒప్పందం మేరకు పోలీసులు కొందరు ఆధార్ కార్డులు తీసుకుని దగ్గర పెట్టుకున్నట్టు తెలిసింది. మూడురోజుల తర్వాత వారిపై కేసులు నమోదు చేస్తారు.

తూర్పున రూ.50 కోట్లు ఆడేశారు..

రాజమమహేంద్రవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోనూ కోడి పందాలు హోరాహోరీగా సాగాయి. రాజకీయ జోక్యంతో రాజకీయ పందాలుగా కనిపించాయి. ఈసారి పందాలతోపాటు జూదం కూడా బాగా పెరిగింది. జిల్లావ్యాప్తంగా సుమారు 100పైగా గ్రామాల్లో కోడిపందాలు, గుండాట, కోతాట జరిగాయి. రంగుబాల్స్ జూదం ప్రవేశించింది. రాజానగరం మండలం దివాన్‌చెరువు శివారు రూపానగర్‌లోని వేపలదిబ్బలో కోడిపందాలతోపాటు గుండాటలు, రంగుబాల్స్ జూదం ఆడారు. జిల్లా అంతటా సుమారు 300 బరులుపైనే ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. ఒక్కో బరిలో సగటున 15 లక్షల జరిగినా జిల్లాలో సుమారు రూ.45 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకూ పందాలు, జూదం జరిగినట్టు అంచనా. బరుల చుట్టూ వందలాది కోడి పుంజులు పెట్టారు. బరుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. చాలాచోట్ల వీఐపీ పాసులు.. సాధారణ పాసులు ఇచ్చారు. ఒక్కో బరిలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ 30 నుంచి 40 పందాలు వరకూ జరిగాయి. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమి నేతల నీడలోనే పందాలు జరిగాయి. బరుల వద్ద స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర ముఖ్యనేతల ఫొటోలతో ఉన్న పెద్ద పెద్ద ఫ్లెక్సీలు ఉండడం గమనార్హం.



ఐ.పోలవరం మండలం మురమళ్లలో గుండాట

ఎస్.యానాం బీచ్‌లో సంక్రాంతి సంబరాలు ప్రారంభం



ఆర్కెస్ట్రాలో గీతాన్ని ఆలపిస్తున్న గాయని

ఉప్పలగుప్తం, జనవరి 13(ఆంధ్రజ్యోతి):ఉప్పలగుప్తం మండలంలోని ఎస్.యానాం బీచ్‌లో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభించిన సంక్రాంతి సంబరాలు సోమవారం ఎంతో ఉత్సాహంగా సాగాయి. మధ్యాహ్నం నుంచి జనం పోటెత్తడంతో బీచ్‌లో పండుగ వాతావరణం నెలకొంది. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు భోగి మంట వేసి సంబరాలను ప్రారంభించారు. వినోద కార్యక్రమాలు కొనసాగాయి. బీచ్‌లో మరో పక్క కోడి పందాల శిబిరం ఏర్పాటు చేశారు. గుండాటల శిబిరాలు సైతం జనాన్ని ఆకర్షించాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచి బీచ్‌కు జనం పోటెత్తారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కుటుంబాలు కార్లలో తరలిరావడంతో పార్కింగ్ ఇక్కట్లు తలెత్తాయి. ఒక సమయంలో నిర్వాహక కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే ఆనందరావు స్వయంగా రంగంలోకి దిగి వాహనాలను అడ్డు తొలగించి పర్యాటకులకు మార్గం సుగమం చేశారు. సముద్ర తీరంలో శాండ్ బైక్‌లపై ప్రయాణించి పర్యాటకులు ఆనందంగా గడిపారు. రాత్రి తొమ్మిది గంటల నుంచి జబర్దస్త్ కళాకారుల ప్రదర్శనలు ఉన్న కారణంగా ఎక్కువ సంఖ్యలో యువత హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేసి, తగిన ఏర్పాట్లు చేశారు.



కార్యక్రమాలను వీక్షిస్తున్న ప్రేక్షకులు



బీచ్‌లో సందడి



8లో

ఉత్కంఠై

ఆత్రేయపురంలో ముగిసిన డ్రాగన్ పడవ పోటీలు

సమ ఉజ్జీలుగా నిలిచిన జంగారెడ్డిగూడెం జెయింట్స్, ఎన్టీఆర్ ఈగల్స్

ఘనంగా భోగి



అయినవిల్లిలో




గుర్రపు బండిపై చిన్నారుల సందడి

అమలాపురం రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాల్లో భాగంగా తొలిరోజు గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని వీధుల్లోను భోగి మంటలు వేశారు. చిన్నారులు భోగి పిడకల దండలు మంటల్లో వేశారు. చిన్నారులకు పెద్దలు భోగి పండ్లు పోశారు. సంక్రాంతి పర్వదినాల్లో భాగంగా తొలిరోజు చిన్నారులు గుర్రపు బండిపై ఊరేగుతూ సందడి చేశారు.



జగ్గన్నతోట ఉత్సవంలో 11 రుద్రుల ప్రభలు ఒకే చోటుకు చేరుకొని భక్తులకు దర్శనమిస్తాయి. ఈ ఉత్సవంలోకి మరో ప్రత్యేక ఆకర్షణగా గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి, గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి ప్రభలు పంట చేలను తొక్కుకొంటూ... అప్పర కౌశిక దాటుకుంటూ ప్రభల తీర్థానికి వచ్చే తీరు చూపరులను గగుర్పాటుకు గురిచేస్తుంది.

పాడవైన కొబ్బరిచెట్లు.. పచ్చని పొలాలు.. ప్రకృతి రమణీయమైన అందాలు.. కోనసీమ ప్రాంతంలో కనుమ రోజున జరిగే అరుదైన వేడుక ప్రభల తీర్థం.. కోనసీమలో వందలాది గ్రామాల్లో నిర్వహించే ఈ ప్రభల తీర్థానికి పలు గ్రామాల నుంచి ప్రభలను యువకులు ఆయా తీర్థం జరిగే ప్రదేశాల నుంచి తీసుకువచ్చి ఆనందంగా ఉత్సవాన్ని నిర్వహిస్తారు. కోనసీమ ప్రాంతంలోని ఎటువంటి గుడిగోపురం లేకుండా జరిగే ఏకాదశ రుద్రుల కలయిక అంబాజీపేట మండలం మొసలపల్లి పరిధిలో జరిగే జగ్గన్నతోట ప్రభల తీర్థం కావడం విశేషం..





రేపే జగ్గన్నతోట తీర్థం..

వేలాది మంది రాక..

ఎన్నో విశిష్టతలు..విశేషాలు..



450 ఏళ్ల చరిత్ర కలిగిన జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని ఆయా ఉత్సవ కమిటీ సభ్యులు కోరుతున్నారు. ప్రతి ప్రభకు రూ.లక్షకు పైగా ఖర్చు అవుతుంది. ఈ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి ప్రభకు సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

వెళ్లొద్దాం.. జగ్గన్నతోట

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి):

450 ఏళ్ల చరిత్ర..

కోనసీమ నడుమ దాదాపు 450 ఏళ్ల క్రితం నుంచి సంక్రాంతి కనుమ పండుగ నాడు వైభవంగా నిర్వహించే జగ్గన్నతోట ప్రభల తీర్థానికి ప్రత్యేక విశిష్టత ఉంది. మకర సంక్రమణ ఉత్తరాయణ మహా పుణ్యకాలంలో సంక్రాంతి కనుమ నాడు అంబాజీపేట మండల మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే ప్రభల తీర్థం అత్యంత చారిత్రాత్మకమైంది. ఈ తీర్థం అతిపవిత్రమైంది. ప్రాచీన కాలంలోనే తొలిసారిగా జగ్గన్నతోటలోనే ప్రభల తీర్థం నిర్వహించారని స్థానికంగా ఉన్న భోగేశ్వరస్వామి ఆలయంలోని రాగి శాసనాన్ని బట్టి తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఎలాంటి గుడి గోపురం లేకుండానే ఏడు ఎకరాల కొబ్బరితోటలో తీర్థం నిర్వహించడం ఓ ప్రత్యేకత. హిందూ శాస్త్రం ప్రకారం ఏకాదశ రుద్రులు కొలువతీరేది దేశం మొత్తంమీద జగ్గన్నతోట ఒక్కటే. 17వ శతాబ్దంలో సంక్రాంతిలో కనుమ నాడు ఏకాదశ రుద్రలు లోక కళ్యాణార్థం జగ్గన్న తోటలో సమావేశమై చర్చించారని చారిత్రక కథ'ం. పూర్వం పెద్దాపురం సంస్థానాధీశులైనా రాజా వత్సవాయి జగనాథమహారాజు(జగ్గన్న) ప్రభల తీర్థం విచ్చేసి ఏకాదశ రుద్రులను దర్శించుకొని ప్రభల తీర్థం ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక కృషి చేశారని అప్పటి నుంచి ఈ ప్రాంతాన్ని జగ్గన్నతోటగా పిలుస్తున్నారని చరిత్ర ఆధారాలను బట్టి తెలుస్తోంది..

ప్రముఖుల ప్రశంసలు



మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే ఏకాదశ రుద్రల ప్రభల ఉత్సవానికి పలువురు ప్రముఖులు ప్రశంసలు అందించారు. 2020 సంవత్సరంలో గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవ యూత్ సభ్యులు జగ్గన్నతోట ప్రభల తీర్థం విశిష్టతను గురించి ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాయడంతో ఆయన స్పందించి తిరిగి శివకేశవయూత్‌కు ప్రతిలేఖను రాశారు. ఏకాదశ రుద్రుల ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. అలాగే 2021లో శృంగేరి పీఠాధిపతులకు లేఖను రాయడంతో శ్రీ విధుశేఖరభారతీ స్వామీజీ ఏకాదశ రుద్రుల ప్రాశస్త్యాన్ని వివరిస్తూ సందేశాన్ని అందించారు. 2023లో దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ పెరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శకటంగా జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రభల తీర్థం థీమ్‌ను ప్రత్యేకంగా రూపొందించి ప్రదర్శించారు. ఈ దృశ్యాన్ని చూసి రాష్ట్రపతి ద్రౌపది ముర్మతో పాటు పలువురు ప్రముఖులు తన్మయత్వం చెందారు. దీంతో ప్రపంచం నలమూలలకు ఏకాదశ రుద్రుల ఖ్యాతి విస్తరించింది.

చేలను తొక్కుకుంటూ..

ప్రభల తీర్థం రోజున ఏకాదశ రుద్రలలో కొలువయ్యే జగ్గన్నతోటకు ప్రభలను తీసుకువచ్చే తీరు తిలకించేందుకు రెండు కళ్లూ చాలవు. మిగిలిన ప్రభల మాట ఎలా ఉన్న గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి, గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి ప్రభలు అప్పర్ కౌశికను దాటుకొంటూ వచ్చే సుందర దృశ్యాలను చూసేందుకు వేలాది మంది పోటీ పడతారు. గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రుకు చెందిన యువకులు ఆయా గ్రామాల ప్రభలను భుజాలపై మోసుకొంటూ అశ్చర్భ శరభ, అల్లల వీర అంటూ బరువైన ప్రభలను పంట చేలను తొక్కుకొంటూ తీసుకువస్తారు. అనంతరం జగ్గన్నతోటకు చెంతనే ఉన్న అప్పర్ కౌశిక నదీని ఈ రెండు ప్రభలను దాటించే తీరు ఉత్కంఠతో గగుర్పాటుకు గురిచేస్తుంది. అలాగే వ్యాఘ్రేశ్వరం నుంచి వ్యాఘ్రేశ్వరస్వామి, కె.పెదపూడి నుంచి మేనేకశ్వరస్వామి, ఇరుసుమండ నుంచి ఆనందరామేశ్వరస్వామి, వక్కలంక కాశీ విశ్వేశ్వరస్వామి, నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి, ముక్కామల రాఘేశ్వరస్వామి, మొసలపల్లి మధుమానంద భోగేశ్వరస్వామి, పాలగుమ్మి చెన్నమల్లేశ్వరస్వామి, పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి వారి ప్రభలపై ఉత్సవమూర్తులను ఉంచి మేళతాళలతో, బాజాభజింత్రీలతో ప్రభల తీర్థానికి తీసుకువస్తారు. ఈ ప్రభలకు అతిథ్యమిచ్చే మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి వారు ప్రభ అన్ని ప్రభల కంటే ముందుగా జగ్గన్నతోటకు చేరుకొని ప్రభలకు ఆహ్వానం పలుకుతుంది.. ఈ తీర్థానికి వ్యాఘ్రేశ్వరస్వామి వారి ప్రభ అధ్యక్షత వహిస్తారు.



రెండెడ్ల బండ్లు తీర్థానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. కొన్ని కుటుంబాల వారు ఇప్పటికి తీర్థానికి ప్రత్యేకంగా అలంకరించిన గూడు బండ్లపై కుటుంబ సమేతంగా తరలిరావడం ఆనవాయితీగా వస్తోంది. పాశ్చాత్య దేశాల్లో సాఫ్ట్‌వేర్‌తో పాటు వివిధ రంగాల్లో దిగ్గజాలుగా రాణిస్తున్న వారు సైతం ఇక్కడ తీర్థానికి రెండెడ్ల బండిపై వచ్చి తీర్థంలోని ప్రభలను దర్శించుకుంటారు.



నేడు కొత్తపేటలో

ప్రభల ఉత్సవం

ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

కొత్తపేట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో సంక్రాంతి ప్రభల ఉత్సవానికి ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తిచేశాయి. 150 ఏళ్ల చరిత్ర కలిగిన కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆయా ఉత్సవ కమిటీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ముందుగా కొత్తపేట మునుసబుగారి ప్రభ వీరభద్రుడిని అలంకరించుకుని పురవీధుల్లో ఊరేగింపుగా రాగా ఆయా వీధి ప్రభలు ప్రధాన ప్రభను అనుసరిస్తూ ముందుకు వెళ్తాయి. అలాగే కొత్తపేట కొత్త రామాలయం ప్రభ రాజరాజేశ్వరీదేవిని అలంకరించుకుని ముందు పురవీధుల్లోకి రాగా ఆయా ప్రభలు ఈ ప్రధాన ప్రభను అనుసరిస్తూ ముందుకు వెళ్తాయి. కొత్త, పాత రామాలయం, బోడిపాలెం ప్రధాన వీధులుగా ఊరేగింపు నిర్వహిస్తూ ప్రభలకు ముందు సంగీత వాయిద్యాల నడుమ మేళతాళాలు డప్పులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో ముందుగా ఊరేగింపుగా వెళ్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద భక్తుల పూజల నిమిత్తం కొలువై ఉంటాయి. ఆ పాఠశాల ప్రాంగణంలోనే బోడపాలెం, పాత రామాలయం, కొత్త రామాలయం మీదుగా పోటాపోటీ బాణసంచా కాల్పులు, చూపరులను కట్టిపడేస్తాయి. భక్తుల సందర్శన అనంతరం రాత్రి 10 గంటలకు ఈ ప్రధాన వీధుల ప్రభల ఊరేగింపు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ తిరిగి ప్రారంభమవుతుంది. తెల్లవారుజామున 4 గంటలకు పాత బస్టాండ్ వద్దకు చేరుకోగా మళ్లీ పాత, కొత్త రామాలయాల పోటాపోటీ బాణసంచా కాల్పులతో సంబరం ముగుస్తుంది. ఈ సంక్రాంతి ఉత్సవం కోసం రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా విదేశాలలో స్థిరపడిన వారు సైతం కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవం చూసేందుకు తరలివస్తారు. పుర వీధులన్ని లక్షలాది జనంతో కిక్కిరిసిపోతాయి. ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు డీఎస్పీ గోవిందరావు పర్యవేక్షణలో రావులపాలెం సీఐ విద్యాసాగర్, ఎస్ఐ జి.సురేంద్ర ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సంక్రాంతి ప్రభల ఉత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం నుంచి వచ్చే వాహనాలను పలివెల మీదుగా ఊతకోట వైపు మళ్లిస్తున్నారు. అలాగే రావులపాలెం నుంచి వచ్చే వాహనాలను బోడిపాలెం మీదుగా వాడపాలెం, వానపల్లి, ముక్తేశ్వరం మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించేందుకు చర్యలు చేపట్టారు.



కొత్తపేటలో ప్రభల ఉత్సవం (ఫైల్)



భోగి మంట వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తున్న తపోవనం సచ్చిదానంద స్వామీజీ

రత్నగిరిపై అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

అన్నవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో సోమవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం 5.30 గంటలకి కుమ్మరిలోవ తపోవనం సచ్చిదానంద సరస్వతి స్వామి భోగి మంట వెలిగించి సంబరాలను ప్రారంభించారు. వార్షిక కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించి తరించగా అర్చకస్వాములు తీర్థప్రసాదాలు అందజేశారు. తెలుగుదనం ఉట్టిపడేలా జంగమదేవరలు, బుడబుక్కలు, కొమ్మదాసులు, గంగిరెడ్లవారు అలరించారు. ఎడ్ల బండి, సంక్రాంతి పిండి వంటకాలు, బొమ్మలకొలువులు, పూరిగుడిసెలు ఏర్పాటు చేశారు. సచ్చిదానంద స్వామీజీ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను అందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని, దైవారాధనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈవో వీర్ల సుబ్బారావు, పీఆర్వో కృష్ణారావు, ఏఈవో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



వార్షిక కల్యాణ వేదికపై ఆశీనులైన స్వామి, అమ్మవార్లు (ఎడమ) సంక్రాంతి పిండి వంటకాలను వండుతున్న మహిళలు (కుడి)



సత్యదేవుని సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు



న్యాయమూర్తులుకు స్వాగతం పలుకుతున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ రాజేష్‌బిందాయ్, జస్టిస్ నరసింహ, జస్టిస్ విశ్వనాథన్, జస్టిస్ ఎస్‌వీఎన్ బాట్టి విచ్చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఈవో వీర్ల సుబ్బారావు పూర్ణకుంభ స్వాగతం పలికారు. దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా మెమెంటో, ప్రసాదాలను ఈవో అందజేశారు.



ఆత్రేయపురం ప్రధాన కాలువలో రసవత్తరంగా సాగుతున్న పోటీ (పైన), జెండా ఊపి ప్రారంభిస్తున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం

ఉత్కంఠగా



ఆత్రేయపురంలో ముగిసిన డ్రాగన్ పడవ పోటీలు

సమ ఉజ్జీలుగా నిలిచిన జంగారెడ్డిగూడెం జెయింట్స్, పల్నాడు పాంథర్స్

విజేతలకు బహుమతుల ప్రదానం

ఆత్రేయపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం ప్రధాన కాలువలో మూడు రోజుల పాటు నిర్వహించిన డ్రాగన్ పడవ పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారు. కలెక్టర్ మహేష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు ట్రోఫీ విజ యానికి కృషి చేశారు. సోమవారం ఫైనల్ పోటీలను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం జెండా ఊపి ప్రారంభించారు. పల్నాడు పాంథర్స్, జంగారెడిగూడెం జెయింట్స్, ఎన్టీఆర్ ఈగల్స్ ఫైనల్స్‌కు చేరుకోగా నువ్వా నేనా అన్న రీతిలో పోటీ సాగింది. జంగారెడ్డిగూడెం, పల్నాడు టీమ్‌లు సమానంగా లక్ష్యాన్ని చేరుకున్నాయి. దీంతో రెండు టీమ్‌లను నిర్వాహకులు విజేతలుగా ప్రకటించారు. ద్వితీయ స్థానాన్ని రద్దు చేసి రెండు జట్లకు చెరో రూ.లక్ష, రెండు ట్రోఫీలు, సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు. తృతీయస్థానంలో నిలిచిన ఎన్టీఆర్ ఈగల్స్ జట్టుకు రూ.30వేలు నగదు అందజేశారు. రంగవల్లులు, పతంగుల పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందించారు. పోటీలకు సహకరించిన వారందరినీ సన్మానించారు. ట్రోఫీ ఆర్గనైజర్ దండు శివను ఎమ్మెల్యే బండారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, ముళ్ళపూడి భాస్కరరావు, వెత్సా అనిల్, ఎంపీడీవో వెంకటరామన్, తహసీల్దారు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు

భీమేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు



పూజల అనంతరం అలంకారంలో స్వామివారు

సామర్లకోట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్ర మహాపర్వదినం అయిన సోమవారం ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేద పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖరశర్మ, అంజిబాబు, వెంకన్న తదితరులతో స్వామివారికి పంచద్రవ్యాలతో అభిషేక పూజలు నిర్వహించారు. విశేష పుష్పార్చనతో స్వామి,అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. పూజల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. నంది మండపం వద్ద పండితులచే వేదాశీర్వచనంతో ప్రసాదాలు స్వీకరించారు. సోమవారం భోగిపండుగ కావడంతో అధిక సంఖ్యలో భక్తుల రాకతో ఆలయం ఆవరణ కిక్కిరిసింది.



జలప్రసాద యూనిట్‌ను ప్రారంభిస్తున్న రాజప్ప

జలప్రసాద యూనిట్ ప్రారంభం

భీమేశ్వరాలయం ఆవరణలో భక్తులకు జల ప్రసాదం పేరిట దివిస్ లాబరేటరీ సంస్థ రూ.18 లక్షలతో నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్ యూనిట్‌ను ఎమ్మెల్యే చినరాజప్ప సోమవారం ప్రారంభించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజప్ప హాజరయ్యి జలప్రసాదాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించి భక్తులకు అందజేశారు. దాతలు సంస్థ ప్రతినిధులు ఆర్. సుధాకర్, బి.వాసుబాబులకు రాజప్ప శాలువాలు కప్పి పూలమాలలు వేసి అభినందించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనంతో ప్రసాదాలు స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని ఈవో అందజేశారు. పారిశ్రామికవేత్త పసల పద్మరాఘవరావు, రైతు సంఘ అధ్యక్షులు కంటే జగదీష్‌మోహన్, భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ పాల్గొన్నారు.

దుర్గాడలో రామలింగేశ్వరస్వామికి

అన్నాభిషేకం

గొల్లప్రోలు రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం, భోగి, శివ ముక్కోటి, పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలోని పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి 121 కిలోల బియ్యంతో వండిన అన్నంతో అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ సంప్రోక్షణ చేసి పుష్పాలతో స్వామిని అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించారు.



దుర్గాడ శివాలయంలో ఉమారామలింగేశ్వరస్వామికి నిర్వహించిన అన్నాభిషేకం

హర్షకుమార్‌ను కలిసిన విమలరెడ్డి



మాజీ ఎంపీ హర్షకుమార్‌తో మాట్లాడుతున్న వైఎస్ విమలరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ భార్యను మాజీ సీఎం జగన్ మేనత్త వైఎస్ విమలరెడ్డి సోమవారం పరామర్శించారు. జిల్లాకు వచ్చిన విమలరెడ్డి సోమవారం హర్షకుమార్ నివాసానికి వెళ్లారు. ఈ మేరకు హర్షకుమార్ కుటుంబీకులు సాదర స్వాగతం పలికారు. సుమారు గంట పాటు విమలరెడ్డి భేటీ అయ్యారు. అనంతరం ఆమెను హర్షకుమార్ శాలువాతో సత్కరించారు. గతంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిళారెడ్డి విషయంలో వ్యతిరేకించిన విమలరెడ్డి ఇప్పుడు హర్షకుమార్‌ను కలవడం చర్చనీయాంశమైంది.

పూల మార్కెట్‌కు సంక్రాంతి శోభ

కడియం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కడియపులంక అంతరాష్ట్ర పూల మార్కెట్ సంక్రాంతి శోభను సంతరించుకుంది. మార్కెట్లో సోమవారం పూల ధరలు ఇలా ఉన్నాయి.

చామంతి(కిలో) రూ.150 - రూ.200
వైట్‌చామంతి(కిలో) రూ.200 - రూ.250
బంతి(కిలో) రూ.70 - రూ.100
చిట్టిగులాబీ(కిలో) రూ.200- రూ.300
జాజులు(కిలో) రూ.1000 - రూ.1500
కాగడాలు రూ. 500- రూ.700
కనకంబరం (బారు -1) రూ.300
డచ్ (20పూలు) రూ.250



కారు ఢీకొని మహిళ మృతి

భర్తకు గాయాలు



లక్ష్మి మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

తొండంగి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు ఆర్చి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మర్రుర్తి లక్ష్మి (35) మృతిచెందింది. కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన వీరబాబు తన భార్య లక్ష్మితో కలిసి మోటార్‌సైకిల్‌పై అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట వెళ్తున్నారు. బెండపూడి సమీపానికి వచ్చే సమయానికి వెనుక నుంచి వచ్చిన కియా కారు ఢీకొనడంతో వెనుక కూర్చున్న లక్ష్మి రోడ్డుపై పడిపోయింది. తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వీరబాబుకు గాయాలు కావడంతో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణ వైభోగమే..

- వాడపల్లి వెంకన్న ఆలయంలో ఘనంగా గోదారంగనాథుని కల్యాణం
- పాల్గొన్న వేలాది మంది యువతీ, యువకులు
- ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బండారు దంపతులు
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు, ఫొటోషూట్లు



వాడపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న యువతులు



ఆత్రేయపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదారంగనాథుల దివ్యకల్యాణ మహోత్సవం వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణల నడుమ వైభవంగా నిర్వహించారు. శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదిక వద్ద బ్రహ్మశ్రీ ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు అర్చకులు కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణ వేదిక భక్తులు వీక్షించేందుకు చూడచక్కని ఏర్పాట్లు నిర్వహించారు. ఫలపుష్పాలతో సర్వాంద సుందరంగా అలంకరించారు. గోదారంగనాధుల గ్రామోత్సవంలో వేలసంఖ్యలో పాల్గొని తన్మయత్వం పొందారు. అనంతరం కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పెళ్లికాని యువతి, యువకులు వేలాదిగా తరలివచ్చి కల్యాణాన్ని జరిపించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కమలారాణి దంపతులు, ఉపకమిషనరు నల్లం సూర్య చక్రధరరావు, కనకదుర్గాదేవి దంపతులు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఫలపుష్ప అలంకరణ భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. స్వామివార్ల అలంకరణతో రూపొందించిన ఫొటోషూట్ల వద్ద భక్తులు సందడి చేశారు. మహారాష్ట్ర కేరళ, తమిళనాడు వాయిద్య కళాకారుల ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహరావు, టీడీపీ మండలాధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, సర్పంచ్ కాయల జగన్నాదం పాల్గొన్నారు. వాడపల్లి వెంకన్న ఆలయానికి సోమవారం రూ.7లక్షల74 వేల 504 ఆదాయం లభించింది.



ఫోటో షూట్ ప్రదర్శనలు





పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు, వాయిద్య కళాకారుల ప్రదర్శన

కమనీయం.. గోదాదేవి కల్యాణం

అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో నిర్వహణ



అప్పనపల్లిలో గోదాదేవి, రంగనాథుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



ఆకట్టుకున్న మహిళల నృత్య ప్రదర్శన

మామిడికుదురు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో వేంచేసి ఉన్న గోదాదేవి కల్యాణాన్ని అర్చకులు సోమవారం కమనీయంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణలతో గోదారంగనాధుల కల్యాణాన్ని వైభవంగా జరిపారు. 200 మంది భక్త దంపతులు కర్తలుగా పాల్గొని కల్యాణ క్రతువులును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మండపాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి స్వామి,అమ్మవార్ల ఉత్సవామూర్తులను కొలువుతీర్చి కల్యాణ క్రతువును నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు దంపతులు కర్తలుగా పాల్గొని కల్యాణాన్ని నిర్వహించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, పలువురు ప్రముఖులు స్వామి,అమ్మవార్లను దర్శించి కల్యాణాన్ని వీక్షించారు.

సంక్రాంతి సంబరాలు

అప్పనపల్లి బాలాబాలాజీ దేవస్థానంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరారన్నంటాయి. ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ వేషధారణలతో పలు భక్త బృందాలు అలరించాయి. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ సిబ్బంది తయారుచేసిన 1600 అడుగుల పొడవు గల భోగి పిడకల దండ భోగిమంటలో వేసి భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.



అలరించిన హనుమంతుడు, జాంబవతుల వేషధారణలు

పార్కింగ్‌లో కనిపిస్తే పట్టుకెళ్లిపోతారు!

- మోటారుసైకిళ్లు దొంగిలిస్తున్న ముగ్గురు నిందితులు అరెస్ట్
- 39 మోటారు సైకిళ్లు స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు

కాకినాడ క్రైం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక పాత నేరస్థుడికి మరో ఇద్దరు తోడయ్యారు. వారికి పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్రవాహనం కనబడితే చాలు చెవులు మెదిలిపోతాయి. వెంటనే ఆ మోటారు సైకిల్‌ను దొంగిలించి అప్పై అమ్మేసి ఆ సొమ్ముతో జల్సాలు చేసుకుంటారు. ఈ విధంగా చెడు వ్యసనాలకు బానిసలై జల్సాలకు మరిగి దొంగతనాలను ప్రవృత్తిగా మరల్చుకుని యథేచ్ఛగా మోటారుసైకిళ్లను దొంగిలిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను కాకినాడ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి 39 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు నిందితుల వివరాలు వెల్లడించారు. ఇటీవల కాకినాడ జిల్లా వ్యాప్తంగా మోటారు సైకిళ్ల దొంగతనాలు జరుగుతున్న తరుణంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఆదేశాలతో ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు నేతృత్వంలో లా అండ్ ఆర్డర్, క్రైం బృందాలు నిఘాను పటిష్టం చేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ముగ్గురు యువకులు కాకినాడ డైరీఫామ్ సెంటర్‌లో అనుమానాస్పదంగా తారసపడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా పాత నేరస్థుడు అనపర్తి మండలం పులగుర్తకు చెందిన పసగడుగుల సత్యనారాయణతో పాటు కిర్లంపూడి మండలం రామకృష్ణాపురానికి చెందిన రాజారపు కృష్ణ, పిఠాపురం మండలం, విరవ గ్రామానికి చెందిన గుదే మణికంఠగా తెలిపారు. వారు ఓ ముఠాగా ఏర్పడి వ్యాయామం చేసే జిమ్‌ల వద్ద, డిమార్ట్ లాంటి షాపింగ్ మాల్స్ వద్ద పథకం ప్రకారం కాసి వాహన యజమాని ఇప్పుడప్పుడే బయటకురాడని నమ్మకం కుదిరాక అటువంటి వాహనాలను దొంగిలిస్తున్నట్టు ఎస్‌డీపీవో పేర్కొన్నారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ రూ.14.40 లక్షలు ఉంటుందని తెలిపారు. నేరస్థులను చాకచక్యంగా పట్టుకున్న క్రైం సీఐ వి కృష్ణ, లా అండ్ ఆర్డర్ సీఐ కెవివి సత్యనారాయణ, ఎస్‌ఐలు సాగర్‌బాబు, వినయ్‌ప్రతాప్, క్రైం డిటెక్టివ్ ఏఎస్‌ఐ కొప్పిశెట్టి గోవిందరావ్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారుసైకిళ్లు


పాదగయలో ప్రభుత్వ విప్ యార్లగడ్డ పూజలు



యార్లగడ్డకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

పిఠాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని సోమవారం రాత్రి ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు సోమవారం రాత్రి సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం గురించి వేద పండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. యార్లగడ్డ దంపతులను ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదానాకి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న సావిత్రి

పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకం ట్రస్టుకు కాకినాడకు చెందిన గజ్జల సావిత్రి రూ.లక్ష విరాళాన్ని పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్‌కు అందజేశారు. ఏటా సుబ్రహ్మణ్యషష్టి రోజున గజ్జల చంద్రశేఖర్ పేరున అన్నదానం చేయాలని ఆమె కోరారు. దాతను ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

రూమ్‌బాయ్ నిజాయితీ

పాదగయ క్షేత్రం వసతి సముదాయంలో రూమ్‌బాయ్‌గా పనిచేస్తున్న జి.సుబ్రహ్మణ్యం నిజాయితీ చాటుకున్నాడు. సముదాయంలోని రూమ్‌లో దిగిన భక్తుడు జీఎస్ గోపాల్ తిరిగి వెళ్లే సమయంలో వ్యాలెట్‌ను మరిచిపోయాడు. అందులో నగదు కూడా ఉంది. దీనిని గుర్తించిన రూమ్ బాయ్ సదరు వ్యాలెట్‌ను పాదగయ ఈవో కాట్నం శ్రీనివాస్‌కు అందివ్వగా ఈలోగా వ్యాలెట్ మరిచిపోయిన భక్తుడు రాగా అతనికి ఈవో అందజేశారు. నిజాయితీ ప్రదర్శించిన రూమ్ బాయ్‌కు భక్తుడు కృతజ్ఞతలు తెలియజేయగా, ఈవో అభినందించారు.

భార్య మరణం తట్టుకోలేక భర్త ఆత్మహత్య?

రాజమహేంద్రవరం అన్నపూర్ణమ్మపేట రైలు గేటు వద్ద ఘటన.. సూసైడ్ నోట్ లభ్యం



కెకె.రాజు మృతదేహం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం అన్నపూర్ణమ్మపేట రైలు గేటు సమీపంలో సుమారు 50 ఏళ్ల వ్యక్తి మృతిచెంది ఉన్నాడని జీఆర్‌పీ పోలీసులకు సోమవారం ఉదయం సమాచారం అందింది. మృతుడి వద్ద సూసైడ్ నోటు లభ్యమైంది. అందులో తన పేరు కేకే. రాజు అని.. తన భార్య చనిపోవడంతో తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన మరణానికి ఎవ్వరు కారణం కాదని రాసి ఉన్నట్టు తెలిపారు. అయితే ఆ సూసైడ్ నోట్‌పై అడ్రస్ లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించినట్టు జీఆర్‌పీ పోలీసులు తెలి పారు. మృతుడు వైట్‌కలర్ షర్ట్, బ్లూకలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని చెప్పారు. వివరాలు తెలిసినవారు జీఆర్‌పీ సీఐ 9440627555, ఎస్‌ఐ 9491444022, స్టేషన్ నెంబరు 08332442821లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

భార్యకు దూరమై.. మానసికంగా కుంగిపోయి!

బాలల సంరక్షణ అధికారి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లాలాచెరువు సమీపంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఓ ఇంట్లో జిల్లా బాలల రక్షణ అధికారి (డీసీపీవో) కె.రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కె.రాజ్‌కుమార్ రాజమహేంద్రవరంలో ఐసీడీఎస్‌లో బాలల సంరక్షణ అధికారిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. భార్యతో మనస్పర్థలు వచ్చి కోర్టులో విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో కుమారుడు కొద్దిరోజులు తండ్రి వద్ద, కొద్దిరోజులు తల్లి వద్ద ఉంటున్నాడు. రాజమహేంద్రవరంలో ఉద్యోగం కావడంతో రాజ్‌కుమార్ సహోద్యోగులతో కలిసి లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలో ఒక రూమ్ అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. భార్య దూరమైనప్పటి నుంచి ఆయన మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో పండుగ సెలవులకు సహచరులు ఊరు వెళ్లిపోగా రాజ్‌కుమార్ ఒక్కరే రూమ్‌లో ఉన్నాడు. సోమవారం ఉదయం కొయ్యల గూడెంలో నివాసం ఉంటున్న అతని తల్లికి ఫోన్ చేసి మాట్లాడాడు. తన పిల్లాడిని జాగ్రత్తగా చూసుకోమని చెప్పాడు. అటుపై రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బొమ్మూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాజ్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

అంతర్వేది, జనవరి 13(ఆంధ్రజ్యోతి):సంక్రాంతి సంబరాలు రాజోలు నియోజకవర్గంలో వైభవంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గంగిరెడ్లు, హరిదాసు, భోగి మంటలు, కనకదుర్గమ్మ, శివపార్వతులు అలంకరణలు, ముగ్గుల పోటీలు తిలకించారు. సఖినేటిపల్లిలంకలో సంక్రాంతి సంబరాలను ఆయన ప్రారంభించారు.

కోడి పందాల్లో విజేత ఆస్ట్రేలియావాసి

ఐ.పోలవరం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కోడి పందాల్లో ఆస్ట్రేలియాకు చెందిన జకీర్ రాజ్ పాల్గొన్నారు. మురమళ్ళ కోడిపందాల కోసం రెండు రోజుల క్రితం ఆయన ఇండియాకు వచ్చారు. కోడి పందాల్లో జకీర్‌రాజ్ కోడి గెలిచింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆయనకు మెమెంటో అందజేశారు.

యథేచ్ఛగా కోడిపందాలు





పి.గన్నవరం మండలం డీఎస్‌పాలెంలో కోడి పందాలు, మలికిపురం: విశ్వేశ్వరాయపురంలో గుండాట, అల్లవరం: దేవగుప్తంలో కోడి పందాలు

-నెత్తురోడిన పందెం బరులు
-గుండాట జోరు.. కట్టలు తెగిన నోటు
-పత్తాలేని పోలీసులు

అమలాపురం రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని విధంగా మండలంలో ఎక్కడపడితే అక్కడ కోడిపందాలు, గుండాటలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అమలాపురం పట్టణంలోని ఈదరపల్లి బైపాస్ రోడ్డులో నాలుగు గుండాట బోర్డులు ఏర్పాటు చేయగా రెండు బోర్డులు ఖాళీగా మిగిలిపోయాయి. వాసర్ల గార్డెన్స్ సమీపంలో ఏర్పాటుచేసిన కోడి పందాల బరి వద్ద జనం లేక వెలవెలబోయింది. సంక్రాంతి పెద్ద పండుగ రోజు నుంచి ఊపందుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక రోళ్లపాలెం, కామనగరువు, సమనస, నవరప్పాలెం, ఇందుపల్లి, పేరూరు తదితర గ్రామాల్లో కోడిపందాల బరులు ఏర్పాటు చేశారు. రెండు, మూడు చోట్ల మినహా మిగిలిన పందాల బరుల వద్ద పందెపు రాయుళ్లు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ముమ్మిడివరం (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని గుండాట, పేకాట, కోడిపందాలు వంటి జూదాలను నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని పోలీసు, రెవెన్యూ అధికారులు పదేపదే హెచ్చరికలు జారీచేసినా పందేల నిర్వాహకులు మాత్రం వాటిని ఎక్కడా ఖాతారు చేయలేదు. సంక్రాంతి పండుగ తొలిరోజు భోగి ఉదయం 10గంటల నుంచే కోడిపందాలకు తెర తీశారు. గతంలో అయితే మొదటిరోజు పన్నెండు గంటలు దాటిన తరువాతే కోడిపందాలు మొదలయ్యేవి. అయితే ఈఏడాది ఉదయం 10గంటలకు ముందుగా సిద్ధం చేసుకున్న బరుల్లో కోడిపందాలు నిర్వహించారు. అధికార పార్టీకి చెందిన నాయకుల బరుల వద్ద కోడి పందాలను అట్టహాసంగా ప్రారంభించారు. కోడిపందాల బరుల వద్ద ఫ్లెడ్‌లైట్లు కూడా ఏర్పాటుచేసి రాత్రి సమయంలో కూడా పందాలను యథేచ్ఛగా నిర్వహించారు. కోడిపందాల వద్ద గుండాట, పేకాట, మాంసం ప్రియులకు బిర్యానీ, కోడి పకోడి, ఇతర తిరు బండారాల స్టాల్స్ ఏర్పాటుచేశారు. మొదటిరోజే కోడిపందాలు, జూదాల్లో లక్షల్లో జేబులు ఖాళీ అయ్యేవి. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెం, మండలంలో అన్నంపల్లి, గేదెల్లంక, కొత్తలంక, అయినాపురం గ్రామాల్లో కోడిపందాలను యథేచ్ఛగా నిర్వహించారు. బహిరంగంగా రోడ్డు పక్కనే కోడి పందాలు జరుగుతున్నా పోలీసు అధికారులు కనీసం అటు పక్క కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. రాజుపాలెంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, గేదెల్లంకలో జనసేన పార్టీ నాయకులు, కొత్తలంకలో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, అన్నంపల్లిలో టీడీపీ, వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో కోడిపందాలు, గుండాటలు జోరుగా సాగాయి. రాజుపాలెంలో సోమవారం ఉదయం 10గంటలకే గుండాటలు ప్రారంభించినా మధ్యాహ్నం3గంటలకు గలాటా ఏర్పడడంతో చిన్న బోర్డులను తాత్కాలికంగా నిలిపివేసి పెద్దబోర్డులు కొనసాగించారు.

పి.గన్నవరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పది చోట్ల కోడిపందాలు, ఒకచోట గుండాటలు జరిగాయి. రెవెన్యూ, పోలీసులు యంత్రాంగం పట్టించుకోకపోవడంతో నిర్వాహకులు అడ్డుఅదుపు లేకుండా బరులు నిర్వహించారు. పి.గన్నవరం, పోతవరం ప్రధాన రహదారి చెంతన, పోతవరం, ఉడిమూడి, వాడ్రేవుపల్లి, మానేపల్లి, నాగుల్లంక, మొండెపులంక, లంకలగన్నవరం, ముంగండ గ్రామాల్లో కోడిపందెలు, గుండాటలు నిర్వహించారు. డీఎస్‌పాలెంతో పాటు పలుచోట్ల పేకాట శిబిరాలు నిర్వహించారు. బరులు వద్ద షామియానాలు ఏర్పాటు చేసి చికెన్‌పకోడి దుకాణాలు, బిరియాని సెంటర్లు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతం తిరునాళ్లను తలపించింది. లంకలగన్నవరం, ముంగండ గ్రామాల్లో నిర్వహించిన కోడిపందాల బరులు వద్ద సందర్శకులు లేక వెలవెలబోయాయి. అయితే రెవెన్యూ సిబ్బంది మాత్రం సంబంధిత బరులు వద్ద స్థల యజమానులకు నోటీసులు అందించి చేతులు దులుపుకున్నారు.

మామిడికుదురు (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతిని పురస్కరించుకుని కోడిపందాలు, గుండాటలు జోరుగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జూద క్రీడల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలో అప్పనపల్లి, పాశర్లపూడి, ఆదుర్రు, మగటపల్లి, గోగన్నమఠం, కరవాక, గెద్దాడ గ్రామాల్లో బరులు ఏర్పాటుచేసి క్రీడలను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా రికార్డింగు డ్యాన్సులు నిర్వహించేందుకు కూడా స్టేజీలు సిద్ధంచేసి అధికారుల అనుమతి కోసం నిర్వాహకులు ఎదురుచూస్తున్నారు. యువకులు గుండాటబోర్డుల వద్ద జూదం ఆడుతూ చేతి చమురు వదుల్చుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో చికెన్ పకోడి దుకాణాలు, మద్యం దుకాణాలు వెలియడంతో సందడి వాతావరణం నెలకొంది. గుండాటలు, కోడిపందాలు జరుగుతున్నా అధికారులు తీసుకున్న చర్యలు శూన్యం.

ఐ.పోలవరం (ఆంధ్రజ్యోతి): పందెం కోడి కాలు దువ్వింది. ఎటు చూసినా పందెంబరులు నెత్తురోడాయి. నోట్ల కట్టలు తెంచుకున్నాయి. సంక్రాంతి ముసుగులో మండలంలో కోడి పందాలు జోరుగా సాగాయి. గుండాట, కోడి పందాల్లో కోట్లాది రూపాయలు చేతులు మారాయి.

ప్రముఖుల సందడి

సోమవారం కోడి పందాలను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేలు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద తదితర ప్రముఖులు కోడి పందాలను వీక్షించారు. ఆస్ట్రేలియా, హైదరాబాదుతో పాటు వివిధ ప్రాంతాల నుంచి కోడి పందాలకు జనం తరలి వచ్చారు.

నోరూరించే రుచులు

కోడి పందాల బరి వద్ద వీఐపీ గ్యాలరీలోని ప్రముఖులకు, అతిథులకు నోరూరించే రుచికరమైన తినుబండారాలు అందించారు. కొబ్బరి గడ్డు, జామకాయలు, కమలాఫలాలు, నేతిబెల్లం పూతరేకులు, రవ్వ లడ్డు, రేగుపండ్లు, తేగలు, వేరుశనగ ఉండలు వంటి పదార్థాలను సరఫరా చేశారు.చికెన్ బిర్యానీ సరేసరి.

కాట్రేనికోన (ఆంధ్రజ్యోతి):సంక్రాంతి ముసుగులో మండలంలో కోడి పందాలు జోరుగా సాగాయి. గెద్దనపల్లి, చెయ్యేరు, పల్లం, పల్లంకుర్రు, బలుసుతిప్ప, మొక్కలతిప్ప, వేట్లపాలెం, లైట్ హౌస్ ప్రాంతాల్లో కోడిపందాలు జోరుగా సాగాయి. గుండాటలు విచ్చలవిడిగా జరిగాయి. ఎప్పటిలాగానే పోలీసులు తమకేమీ తెలియనట్టు దూరంగా జరిగారు.

అంతర్వేది (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో సోమవారం మధ్యాహ్నం నుంచి కోడి పందాలు, గుండాటలు జోరుగా సాగాయి. ప్రత్యేకంగా ఇతర రాష్ట్రాల నుంచి కోనసీమకు కోడిపందాలు, గుండాటలు, సంక్రాంతి సంబరాల్లో పాల్గొనేందుకు ఉత్సాహపడతారు. సఖినేటిపల్లి మండలంలో ఎక్కడ చూసినా తెలంగాణ రాష్ట్రానికి చెందిన కార్లు, వాహనాలు చక్కర్లు కొడుతున్నాయి. సఖినేటిపల్లి, అంతర్వేది దేవస్థానం, కేశవదాసుపాలెం, అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం గ్రామాల్లో పందాలు జోరుగా సాగాయి.

రాజోలు (ఆంధ్రజ్యోతి): రాజోలు, శివకోడు, చింతలపల్లి, వేగివారిపాలెం తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచే కోడిపందాలు, పేకాటలు జరిగాయి. కోడి పందాలను చూసేందుకు మహిళలు, చిన్నారుల, వృద్ధులు రావడం విశేషం. హైదరాబాద్, వైజాగ్ వంటి ప్రాంతాల నుంచి తరలివచ్చి పందాలను ఆసక్తిగా తిలకించారు.

అల్లవరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కోడిపందాలు పేలవంగా సాగాయి. నిర్వాహకులు ఆశించిన మేర పందాలు జరగలేదు. పందెపు బరుల వద్ద గుండాట బోర్డుల వద్ద స్వల్ప ఘర్షణలు తలెత్తాయి. అల్లవరం సడక్‌రోడ్డు, తూర్పులంక, గుత్తులవారిపాలెం, కోడూరుపాడు, గుడ్డివానిచింత, దేవగుప్తం, రెల్లుగడ్డ గ్రామాల్లో కోడిపందాలు జరిగాయి. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మాంసం పకోడీలు, కోస మాంసం కోసం జనం ఎగబడ్డారు.

ఉప్పలగుప్తం (ఆంధ్రజ్యోతి): ఎంతో ఉత్సాహంగా ఏర్పాటు చేసిన సంక్రాంతి కోడి పందాల బరులు ఈఏడాది మండలంలో వెలవెలబోయాయి. సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న ఎస్.యానాం బీచ్‌తో పాటు ఎన్.కొత్తపల్లి, చల్లపల్లి, వాడపర్రు, సింగరాయపాలెం, చినగాడవిల్లి గ్రామాల్లో పందాలు జరిగాయి. పందాలకు, గుండాటలకు భారీగా ఏర్పాట్లు చేశారు. అయితే అన్ని చోట్ల అంతంత మాత్రంగానే పందాలు జరగడంతో నిర్వాహకులు నిరాశపడ్డారు. గుండాటలకు సైతం అంతగా ఆదరణ లభించలేదు. రాత్రి సమయంలో గుండాట, పేకాటలు జరుగుతాయని నిర్వాహకులు ఆశ పెట్టుకున్నారు. ఎక్కడికక్కడ పందెం బరులు ఏర్పాటు చేయడంతో అన్ని చోట్లా బరులు వెలవెలబోయినట్టు నిర్వాహకుల అంచనా.

అంబాజీపేట (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ముక్కామలలో కోడిపందాలు, గుండాటలు హోరాహోరీగా నిర్వహించారు. కోడిపందాలను వైసీపీ నాయకులు ప్రారంభించారు. గుండాటలు, కోడిపందాల నిర్వహణతో ఆ ప్రాంతంలో సందడిగా నెలకొంది.

ఆనందోత్సాహాలతో భోగి





అంబాజీపేటలో యువకులు వేసిన భోగిమంట, ముమ్మిడివరంలో భోగిమంట దృశ్యం, అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో పుష్పాలంకరణ

ముమ్మిడివరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ తొలిరోజు భోగిని ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునే స్నానాలు ఆచరించి నూతన దుస్తులు ధరించి గ్రామాల్లోని నాలుగు వీధుల కూడళ్లలో పెద్దపెద్ద భోగిమంటలు వేసి వాటిలో భోగి దండలు వేసి పండుగ జరుపుకున్నారు. పుట్టింటి ఆడపడుచులు, అల్లుళ్ల రాకతో గ్రామాల్లో సందడి నెలకొంది. చిన్నారులు గాలిపటాలు ఎగురవేశారు. చిన్నారులకు భోగి పండ్లను వేసి బొమ్మలకొలువును తీర్చిదిద్దారు. ఇళ్ల ముందు రంగవల్లికలు వేసి ఆకట్టుకున్నారు.

భోగభాగ్యాల భోగి

పి.గన్నవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సోమవారం భోగి సందర్భంగా గ్రామాల్లో భోగాభాగ్యాలతో అందరూ ఆనందంగా ఉండాలని కోరుకుంటూ ఆయా గ్రామాల్లో భోగి మంటలు వేసి పండుగను ఆనందంగా ప్రారంభించారు. ప్రతి గ్రామంలో ప్రధాన కూడళ్లలో పోటాపోటీగా యువకులు భోగి మంటలు వేశారు. ముంగండ ముత్యాలమ్మ వీధి కాపులపాలెం యువత భారీ భోగిమంటను వేశారు. లంకలగన్నవరం లాకువద్ద భోగిమంటను స్థానిక యువత వేశారు. సంక్రాంతి నేపథ్యంలో గ్రామాల్లో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

నాగు ల్లంక శివారు చాకలిపాలెంలో ప్రముఖ న్యాయ వాది మోల్లేటి శ్రీనివాసరావు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు ఆకట్టుకుంది. 100కు పైగా బొమ్మలను ఏర్పాటుచేసి పూజలు చేశారు. ప్రధాన రహదారి చెంతనే కావడంతో అటుగా వెళ్లే వాహనదారులు బొమ్మలకొలువు వద్ద ఫొటోలు తీసుకోవడానికి ఆసక్తి చూపారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

అంబాజీపేట, జనవరి13(ఆంధ్రజ్యోతి): భోగి పండుగను చిన్నారులు, యువకులు సోమవారం ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. యువకులు పోగుచేసిన దుంగలను ఒక చోటికి చేర్చి భోగి మంటలను వేశారు. వేకువజామున చిన్నారులు తయారుచేసిన భోగి పిడకలను మంటలో వేశారు. అనంతరం గ్రామాల్లో చిన్నారులకు భోగి పళ్లను పోశారు. మండలంలోని పలు గ్రామాల్లో భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. గంగలకుర్రు అగ్రహారంలో ఉన్న శ్రీవీరేశ్వరస్వామి, కేశవస్వామి ఆలయంలో చామంతి పువ్వుల పూజ నిర్వహించారు. స్వామి వార్లకు అభిషేకాలు చేపట్టారు. మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అయినవిల్లి ఆలయంలో సంక్రాంతి శోభ

అయినవిల్లి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం సోమవారం సంక్రాంతి పురస్కరించుకుని అశేష భక్తజనంతో శోభిల్లింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయ రహదారులన్నీ కిక్కిరిశాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా అధిక సంఖ్యలో నూతన వాహనాలకు పూజలు జరిపించుకున్నారు. ఆలయ మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. భక్తుల రద్దీ దృష్ట్యా బఫే విధానంలో అన్నసమారాధన నిర్వహించారు.

పుష్పాలతో అలంకరణ..

అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయాన్ని సంక్రాంతి సందర్భంగా వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. సిద్ధివినాయక ఆలయ ముఖ మండపం, కేశవస్వామి, విశ్వేశ్వర స్వామి అన్నపూర్ణాదేవి, కాలభైరవస్వామి ఆలయాలకు పుష్పాలంకరణ చేశారు.

గ్రామాల్లో సంక్రాంతి శోభ..

సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో సంక్రాంతి శోభ నెలకొంది. ఉదయాన్నే భోగిమంటలు వేశారు. రంగవల్లికలు, హరిదాసు కీర్తనలు.. బంధువుల రాకతో గ్రామాలు కళకళ్లాడాయి.

గ్రామాల్లో పందాల బరులు సిద్ధం..

కోడిపందాలకు పందెపు రాయుళ్ల బరులు సిద్ధం చేశారు. మండలంలోని తొత్తరమూడి, సిరిపల్లి, విలస గ్రామాల్లో కోడిపందాలు, గుండాటలకు నిర్వాహకులు బరులు ఏర్పాటుచేశారు.

సంక్రాంతి సందడి

మలికిపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో సంక్రాంతి సందడి కొట్టొచ్చినట్టు కనిపించింది. గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో భోగి మంటలు వేశారు. భోగి పండుగ సందర్భంగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు ఆధ్వర్యంలో భోగి శుభాకాంక్షలతో పాటు ఎమ్మెల్యేకు మిఠాయిలు అందించారు. అదే విధంగా టీడీపీ నాయకులు ముప్పర్తి నాని, చాగంటి స్వామి, అడబాల యుగంధర్, సెంట్రల్ డెల్టా ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్‌లు ఎమ్మెల్యేకు సంక్రాంతి శుభాకాంక్షలతో పాటు జీడిపప్పు మిఠాయిని అందించారు. మండల పరిధిలో మలికిపురం, విశ్వేశ్వరాయపురం, లక్కవరం, తూర్పుపాలెంలలో కోడిపందాలు, గుండాటలు జరుగుతున్నాయి. కేశనపల్లిలో చిన్నారులు వెయ్యి మీటర్ల భోగి పిడకల దండను తయారుచేసి ఊరేగింపుగా వెళ్లి భోగిమంటలో వేశారు. తూర్పుపాలెంలో నీలపళ్లమ్మ 63వ వార్షికోత్సవం సందర్భంగా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ నుంచి గ్రామాలకు భారీగా వాహనాలతో బంధువులు రావడంతో ప్రతీ వీధిలోను కార్లు దర్శనమిస్తున్నాయి. ఈఏడాది సంక్రాంతి సంబరాలు ఘనంగానే జరుగుతున్నాయి.

ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంతర్వేది, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఉభయ రాష్ట్రాల నుంచి భక్తులు విశేషంగా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన భోగిమంట, ధాన్యం బస్తాలతో ఎడ్ల బండి తదితర సంక్రాంతి సంబరాలు, వేడుకలు అంబరాన్నంటాయి. భోగి పండుగ సందర్భంగా ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. ప్రత్యేకక్యూలైన్లో స్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

ఘనంగా భోగి వేడుకలు

రాజోలు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో భోగి పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు ఉదయం నిద్రలేచి తలస్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి భోగిమంట వద్దకు వెళ్లి పిడకలు వేశారు. సంక్రాంతి సందర్భంగా ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.

ఉత్సాహంగా భోగి పండుగ

యానాం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): యానాంలో భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. నగరంలోని ప్రతీ కూడలి వద్ద యువకులు భోగిదండలతో మంటకు పీఠం చేయగా తెల్లవారుజామున మహిళలు పూజలు అనంతరం మంటను వెలిగించారు. కూనంరెడ్డి జంక్షన్, వెంకటనగర్, జిక్రియానగర్, వికాశ్‌కాలనీ, అగ్రహారం, దోబీవీధి, చింతావారివీధి, కొత్తపేటతో పాటు అన్నిగ్రామాల్లో యువకులు భోగి మంటలు వెలిగించి సంబరాలు చేశారు.

సమతా కల్యాణ మండపం అభివృద్ధి

అంతర్వేది, జనవరి 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోనే సఖినేటిపల్లి సమతా కల్యాణ మండపం అత్యాధునిక హంగులతో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి సమతా కల్యాణ మండపంలో సోమవారం విదేశీయులతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. పరంజ్యోతి చర్చి ప్రతినిధుల సహకారంతో విదేశీయులను సమతా కల్యాణ మండపానికి తీసుకువచ్చి పరిశీలించారు. వారి సహకారంతో రూ.కోటి 80లక్షలతో నూతన హంగులతో సమతా కల్యాణ మండపానికి సౌకర్యాల కల్పనకు విదేశీయులను కోరారు. వారికి అనుకూలంగా స్పందించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీ వీరా మల్లిబాబు, తాడి మోహన్‌కుమార్, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

పీవీ సింధు తల్లిదండ్రుల పూజలు

అంతర్వేది, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు తల్లిదండ్రులు సోమవారం విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మొక్కు తీర్చుకునేందుకు ఆలయానికి వచ్చామన్నారు. వారికి ఆలయ ఏసీ వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

ముగిసిన బాడీబిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలు




అమలాపురంలో బాడీబిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలు

టైటిల్ విన్నర్‌గా దుర్గాప్రసాద్

అమలాపురంటౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలు ముగిశాయి. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో కోనసీమ బాడి బిల్డింగ్ అసోసియేషన్, హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ సంయుక్త ఆధ్వర్యంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు అధ్యక్షతన జరిగిన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎం.పోలయ్య, బి.కృష్ణ, బి.ప్రకాష్, డీవీ రమణ, వై.శ్రీనివాసరావు, ఎంవీ సముద్రం వ్యవహరించారు. పోటీల విజేతల వివరాలను జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ప్రకటించారు. 70కిలోలవిభాగంలో పి.బాలరాజు (కాకినాడ జిల్లా), 75కిలోల విభాగంలో పి.శివగణేష్ (కోనసీమ జిల్లా), 75కిలోల పైబడిన విభాగంలో జి.హేమంత్‌కుమార్ (కాకినాడ జిల్లా)లు విన్నర్స్‌గా నిలిచారు. మాస్టర్స్ విభాగంలో బి.శంకర్ (కాకినాడ జిల్లా), దివ్యాంగ విభాగంలో జి.మోషే (కోనసీమ జిల్లా), 165 బిలో ఫిజిక్ స్పోర్ట్స్ విభాగంలో పి.బాలరాజు (కాకినాడ జిల్లా), 165 పైబడిన ఫిజిక్ స్పోర్ట్స్ విభాగంలో సీహెచ్ ఇళయరాజా (కాకినాడ జిల్లా) ప్రథమ స్థానాలు సాధించారు. బాడీ బిల్డింగ్ టైటిల్ విన్నర్‌గా కాకినాడ జిల్లాకు చెందిన ఎం.దుర్గాప్రసాద్, రన్నర్‌గా జి.హేమంత్‌కుమార్ నిలిచారు. ఫిజిక్స్ స్పోర్ట్స్ టైటిల్ విన్నర్‌గా సీహెచ్ ఇళయరాజా, రన్నర్‌గా పి.బాలరాజు నిలిచారు. ఆయా విజేతలకు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, పోటీల ఆర్గనైజర్ ఆశెట్టి ఆదిబాబు, గౌరవాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, ముత్తాబత్తుల వెంకటరమణ షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు.

నందెపువారి ఇంట సంక్రాంతి సంబరాలు



నందెపు వారి ఇంట సరదా కోడిపందాలు

అమలాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ)-విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. అమలాపురం బైపాస్ రోడ్డులోని ఎన్టీఆర్ నగర్‌లో నందెపువారి ఇంట సంక్రాంతి సంబరాల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. యువతుల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సరదా కోడి పందాలు నిర్వహించి గంగిరెద్దుల ఆటలు, రెండెడ్ల బండ్లపై సవారీలు చేశారు. భోగి పండుగను పురస్కరించుకుని బాలాజీ, విజయలక్ష్మి దంపతులు భోగి మంటలు వేశారు. పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నందెపు హర్షవర్ధన్-యజ్ఞసరోజ, హరదేవ్ -స్నేహిత, మెట్ల రమణబాబు, గంధం పల్లంరాజు, చిక్కాల గణేష్, ఆశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓడలరేవు తీరంలో కైట్ ఫెస్టివల్‌కు పోటెత్తిన జనం

అల్లవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నేపథ్యంలో ఓడలరేవు తీరంలో వేలాదిగా గాలిపటాలను ఎగురవేసి ఘనంగా కైట్ ఫెస్టివల్ నిర్వహించారు. నిర్వాహకులు 2వేల గాలిపటాలను పంపిణీ చేయగా తీరంలో గాలిపటాలు సందర్శకులకు ఆనందోత్సాహాలు నింపాయి. అల్లవరం ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో తీరంలో బందోబస్తు నిర్వహించారు. తాడి ధర్మారావు, పెమ్మాడి రమేష్, కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, సోమాని వెంకటరమణ, పెచ్చెట్టి బాబ్జి ఆధ్వర్యంలో కైట్ ఫెస్టివల్ ఘనంగా జరిగింది.

కోనసీమ అందాలు కట్టిపడేశాయి



పి.గన్నవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అందమైన పంటకాల్వలు, కొబ్బరిచెట్లు, పచ్చని పొలాలతో కోనసీమ అందాలు కట్టిపడేశాయని అమెరికాలోని న్యూయార్క్ కనెక్టికట్‌కు చెందిన దినకర్, శశిరేఖ దంపతులు ఆనందాన్ని ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. సంక్రాంతి వేళ కోనసీమలోని పలు ప్రాంతాలను వారు సందర్శించారు. స్వగ్రామం తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ అని, కొన్నేళ్లుగా అమెరికా న్యూయార్క్‌లో ఉంటున్నామని చెప్పుకొచ్చారు. ఆంధ్రాలోని కృష్ణ జిల్లాలోని బంధువులు ఆహ్వానంతో వచ్చామని సంక్రాంతి నేపథ్యంలో కోడిపందాలు, గుండాటలు, సంప్రదాయాలను చూడటానికి వచ్చామన్నారు.

అపూర్వం.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మామిడికుదురు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వసమ్మేళనం సోమవారం ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగింది. 35సంవత్సరాల తరువాత తాము విద్యాబుద్ధులు నేర్చుకున్న స్కూలు ఆవరణలో కలుసుకుని ఒకరినొకరు యోగా క్షేమాలు అడికి తెలుసుకుని ఆనందోత్సాహలతో గడిపారు. భోగిమంటలు వేసి సందడి చేశారు. స్కూలు నిర్మాత గోకవరపు పెరుమాళ్లస్వామి, సరస్వతీదేవి విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలుచేసి ఉల్లాసంగా.. ఉత్సాహంగా స్కూలు ఆవరణ అంతా కలియతిరిగి సాయంత్రం వరకు గడిపారు. ఆ రోజుల్లో తాము చేసిన చిలిపి పనులు, అల్లరి చేష్టలను జ్ఞప్తికి తెచ్చుకుని ఆనందోత్సాహాల మధ్య మునిగి తేలారు. 70మంది విద్యార్థులు ఒకచోట చేరి ఆనందోత్సాహాలను పంచుకున్నారు.

జగ్గన్నతోట ప్రభల ఉత్సవానికి భారీ బందోబస్తు

అంబాజీపేట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా అంబాజీపేట మండలం జగ్గన్నతోటలో జరిగే ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవానికి ఎస్పీ ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు పర్యవేక్షణలో సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ కె.చిరంజీవి తెలిపారు. అలాగే పలు రహదారుల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తునట్లు ఆయన తెలిపారు. 360మందితో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ఏడుగురు సీఐలు, 23మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, 32 హెడ్‌కానిస్టేబుల్స్, 230 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

ముక్కామలలో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ

పలువురికి తీవ్రగాయాలు

అంబాజీపేట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ముక్కామల హైస్కూల్ సమీపంలో రెండు సామాజిక వర్గాల మధ్య సోమవారం సాయంత్రం ఘర్షణ జరిగింది. ముక్కామల హైస్కూల్ సమీపంలో కోడిపందాలు, గుండాట శిబిరాలు ఏర్పాటు చేశారు. జనం భారీగా తరలివచ్చి మోటార్‌సైకిళ్లను రహదారిపై పార్కింగ్ చేశారు. దీంతో మోటారుసైకిళ్ల తప్పించే ప్రయత్నంలో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాలకు చెందిన వారు ఒకరిపైఒకరు దాడి చేసుకోవడంతో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు అక్కడకు చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టి ఘర్షణను అదుపుచేశారు. అక్కడ జరుగుతున్న కోడిపందాలు, గుండాటలను నిలుపుదల చేశారు. ఘర్షణ జరుగుతున్న సమయంలో పోలీస్‌కానిస్టేబుల్‌పై కొందరు యువకులు కేకలు వేసినట్లు స్థానికులు తెలిపారు. దీనికి సంబంధించి ఫిర్యాదులు వచ్చిన వెంటనే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ కె.చిరంజీవి తెలిపారు.




ఆలమూరులోనున్న అయ్యప్పస్వామి. పక్క చిత్రంలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రాచీన సంస్కృతి పరిరక్షణకు కృషి చేద్దాం

కొత్తపేట ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రాచీన సంస్కృతి పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు అయ్యప్పస్వామి ఆలయం వద్ద ప్రాచీన సంప్రదాయాలను పరిరక్షించడంలో ఆలయ కమిటీ కృషిని అభినందించారు. ఆలయ కమిటీ నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందించారు. కార్యక్రమంలో టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆఫీసర్ పి.ఆనందతీర్థాచార్యులు, అయ్యప్పస్వామి ఆలయ కమిటీ వ్యవస్థాపకుడు పి.ముకుందేశ్వరస్వామి, సర్పంచ్ నాతి లావణ్య, నాయకులు వంక అన్నవరం, వంటిపల్లి పాపారావు, చైట్ల దుర్గారావు, రావాడ సత్తిబాబు, గన్ని వెంకన్నబాబు, అల్లంరాజు రామకృష్ణమూర్తి, కెఎస్ఎస్ శర్మ తదితరులను ఆనందతీర్థాచార్యులు సత్కరించారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా వంటిపల్లి: అయ్యప్పస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా వంటిపల్లి సతీష్‌కుమార్‌ను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన్ను టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ఆఫీసర్ ఆనందతీర్థాచార్యులు, ఎమ్మెల్యేతోపాటు, నాయకులు అభినందించారు.

చిన్నతనం నుంచే నేర్పాలి: చిన్నప్పటి నుంచే విలువలతో పిల్లలను పెంచడం వల్ల వారిలో జాలి, దయాగుణం అలవడుతాయని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) దానసాహిత్య ప్రాజెక్టు ఆఫీసర్ పి.ఆనందతీర్థాచార్యులు అన్నారు. ఆలమూరు అయ్యప్పస్వామి ఆలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సభలో ఆయన మాట్లాడారు. సనాతన ధర్మాన్ని అలవాటు చేయడం ద్వారా ఉత్తమ పౌరులుగా తయారవుతారని అన్నారు.

నేడు మకరజ్యోతి దర్శనానికి ఏర్పాట్లు: అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేశారు. నేటి సాయంత్రం 6.45 గంటలకు మకరజ్యోతి దర్శనం జరిగేలా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నం 2గంటల నుంచి గ్రామంలో వందలాది మంది బాలికలచే జ్యోతులతో స్వామి ఆభరణాలను డోలుస న్నాయి, కేరళ వాయిద్యాలతో ఊరేగింపు జరుతుందని ఆలయ వ్యవస్థాపకులు ముకుందేశ్వరస్వామి, అభివృద్ధి కమిటీ చైర్మన్ సతీష్‌కుమార్ తెలిపారు. అనంతరం ఆలయ ప్రాగణంలో మకరజ్యోతి దర్శనం, ఏడుగంటలకు ఆలయానికి పక్కనే ఉన్న చెరువులో తెప్పోత్సవం, బాణసంచా కాల్పులు నిర్వహించనున్నట్లు చెప్పారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఏర్పాట్లు చేయనున్నారు.



పసలపూడిలో ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో టీడీపీలో చేరిన గ్రామస్థులు

చంద్రబాబు పాలనపై ప్రజలు ఆకర్షితులవుతున్నారు

ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనకు ప్రజలు ఆకర్షిలవుతున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని పసలపూడి గ్రామానికి చెందిన 52 మంది ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు నల్లమిల్లి సూర్రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం గ్రామానికి చెందిన నల్లమిల్లి అనిల్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, గౌతమ్‌రెడ్డి తదితర 54 మంది గ్రామస్తులు పార్టీలో చేరగా వారిని ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో రామచంద్రపురం వాటర్ డీసీ చైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, టీడీపీ ప్రధాన కార్యదర్శి అనుసూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ, గోకులం షెడ్ ప్రారంభం: పసలపూడి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామంలో నిర్మించిన గోకుల షెడ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. సంక్రాంతి పండుగలను సంప్రదాయ క్రీడలతో ఆనందంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.




ఆలమూరు మండలం గుమ్మిలేరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం. పక్క చిత్రంలో కపిలేశ్వరపురం అంగరలో కల్యాణం చేస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు

వైభవంగా గోదాదేవి కల్యాణం

కపిలేశ్వరపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర వేణుగోపాలస్వామి ఆలయంలో భోగి పండుగ సందర్భంగా సోమవారం గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని జరిపారు. ఈసందర్భంగా స్వామివారికి విశ్వక్షేనపూజ, పుణ్యాహ వచనం తదితర పూజలు, స్వామివారి కల్యాణాన్ని ఆలయ అర్చకుడు ఎస్ఎల్ఎన్‌బీ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పలువురు వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపారు. అంగర వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు కె.బాలబాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం జరిగింది. కార్యక్రమాల్లో ఆయా గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, ఆలయ కమిటీ, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

ఆలమూరు: ఆలమూరు మండలం గుమ్మిలేరు శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారిని పల్లకీలో గ్రామోత్సవం జరిపారు. అనంతరం ఆలయ మండపంలో గోదాదేవి, రంగనాథ్‌స్వామిల విగ్రహాలను ఉంచి అర్చకులు, పలువురు వేదపండితుల అధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. గుమ్మిలేరుకు చెందిన రెడ్డి దుర్గాభవానీ పలు పూజలు చేశారు. కల్యాణోత్సవ ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు రెడ్డి సత్తిబాబు పర్యవేక్షించారు.

విజయదుర్గా పీఠంలో పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గా అమ్మవారు

రాయవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఫాల్గుణ పౌర్ణమి పూజలు సోమవారం నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయదుర్గా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. విజయదుర్గా అమ్మవారికి అష్టోత్తర, సహస్ర నామాలతో మహిళలతో సామూహిక కుంకుమార్చనలు జరిపారు. అనంతరం అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్య కనకదుర్గ, పీఠం పీఆర్వో బాబి తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి గాడ్ జన్మదిన వేడుకలు: వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్ 89వ జన్మదిన వేడుకలు ఈనెల 17, 18, 19 తేదీల్లో నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ సోమ వారం తెలిపారు. గాడ్ సమక్షంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 17న తమిళనాడు వేద పండితులతో స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం అరుణాచలం వేదపండితులతో అరుణాచలేశ్వరుడు, అపితకుచాంబ దేవి కల్యాణం నిర్వహిస్తామన్నారు. 18న తిరుమల తిరుపతి వేదపండితులతో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం, సాయంత్రం అమ్మవారికి గులాబీ అర్చనలు, హారతులు, ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహిస్తామన్నారు. 19న గాడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉదయం ఆయనకు మంగళహారతులు, పాదపూజ జరుగుతుందన్నారు. అనంతరం జన్మదిన వేడుకలు ప్రారంభమవుతాయన్నారు.

ఆశ్రమంలో చిన్నారులకు దుస్తుల బహుకరణ

రావులపాలెం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఊబలంక మదర్‌థెరిసా ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు సంక్రాంతి సందర్భంగా నూతన దుస్తులు బహుకరించారు. ఆశ్రమం గౌరవ అధ్యక్షులు డాక్టర్ నల్లమిల్లి సూర్యనారాయణరెడ్డి, దండు సత్యనారాయణ రాజు, జంపన సూర్యనారాయణరాజు ఆర్థిక సాయంతో దుస్తులను బహుకరించారు. అన్నదాన నిమిత్తం లక్ష్మీప్రజ్ఞ రూ.15వేలు బహుకరించారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

పీవీ సింధు తల్లిదండ్రుల పూజలు

అంతర్వేది, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు తల్లిదండ్రులు సోమవారం స్వామివారిని దర్శించుకున్నారు. మొక్కు తీర్చుకునేందుకు ఆలయానికి వచ్చామన్నారు. వారికి ఆలయ ఏసీ వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.



రామచంద్రపురంలో భోగి మంటలో కుమార్తెతో పిడకల దండ వేయిస్తున్న మంత్రి సుభాష్



రాయవరం ఈశ్వరరెడ్డినగర్‌లో భోగి మంటలో వేసేందుకు సిద్ధం చేసిన 200 అడుగుల పిడకల దండ



ఆత్రేయపురం మండలం వాడపల్లిలో భోగి మంటను వెలిగిస్తున్న ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు

ఆనందోత్సాహాలతో భోగి పండుగ

• తెల్లవారుజాము నుంచే భోగి మంటల వద్ద యువకులు, గ్రామస్తుల సందడి • భోగి పిడకలు వేసిన చిన్నారులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణ, మండలంలో సోమవారం భోగి పండుగను సంప్రదాయబద్ధంగా జరిపారు. వీఎస్ఎం కళాశాలలో మంత్రి సుభాష్ నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆయన భోగి మంటను వెలిగించారు. అనంతరం సతీ సమేతంగా భోగి మంట చుట్టూ ప్రదక్షిణ చేసిన అనంతరం కుమార్తెలతో పిడకల దండ వేయించారు. గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి తల్లిదండ్రులు వాసంశెట్టి సత్యం, కృష్ణకుమారి, సోదరి శ్రీసత్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలో పలు కూడళ్లలో భోగి మంటలు వేశారు.

మండలంలో...: రామచంద్రపురం మండలంలో సోమవారం భోగి పండుగను సంప్రదాయబద్ధంగా జరిపారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఉత్సాహంగా భోగి పండుగను జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో భోగి మంటలు చేశారు.

యథేచ్ఛగా కోడిపందాలు

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం పట్టణ, మండలంలో సంక్రాంతి పురస్కరించుకుని కోడి పందాలు, గుండాటలు నిరాటంకంగా సాగాయి. రామచంద్రపురంలో లారీ యూనియన్ కార్యాలయం సమీపంలోను, చోడవరం రోడ్డులో ప్రైవేటు లేఅవుట్‌లో కోడి పందాలు నిర్వహించారు. మండలంలో వెల్ల, ఉట్రుమిల్లి, వెంకటాయపాలెం, హసన్‌బాదల్లో కోడి పందాలు గుండాటలు నిర్వహించారు.

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద రంగవల్లులు, హరిదాసు సంకీర్తనలు, డుడూ బసవన్నల సందడితో వేడుకను నిర్వహించారు. ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు 150 అడుగుల భోగి దండను మంటలో వేసి వేడుకను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో వేసిన భోగి మంటల్లో యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కె.గంగవరం మండలం యండగండిలో భోగి మంట వద్ద సందడి చేస్తున్న దృశ్యం

ఆలమూరు: మండలంలో భోగి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. గ్రామాల్లోని కూడళ్లలో తెల్లవారుజాము నుంచే భోగి మంటలను వెలిగించారు. పెదపళ్ల పోలేరమ్మ ఆలయం వద్ద గ్రామస్తులు భోగి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా 300 అడుగుల భోగి దండను ఊరేగించి మంటలో వేశారు.

రాయవరం: మండలంలోని ఆయా గ్రామాల్లో భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. వేకువజామున ఆయా గ్రామాల్లో భోగి మంటలు వేశారు. చిన్నారులు భోగి మంటల్లో భోగి దండలు వేశారు. రాయవరం ఈశ్వరరెడ్డి నగర్ లో లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 200 అడుగుల భోగి దండను మంటలో వేశారు. కార్యక్రమంలో పులగం శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వెంకట రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని 12 గ్రామాల్లో మహిళలు రంగవల్లులతో సందడి చేశారు. మండలంలోని వైష్ణవాలయాలతో పాటు, శివాలయాలు, అమ్మవారి ఆలయాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి.

కపిలేశ్వరపురం: సంక్రాంతి పండుగల్లో తొలిరోజైన భోగి పండుగను ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కేదార్లంకలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో మహిళల ముగ్గుల పోటీలను పరిశీలించి విజేతలకు బహుమతులు అందించారు. తొలుత కూటమి నాయకులు ఆయనకు స్వాగతం పలుకుతూ సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలో భోగి పండుగను సోమవారం ఉత్సాహంగా జరిపారు. ఆయా గ్రామాల్లో వేకువజాము నుంచే భోగి మంటలు వేసి యువకులు, గ్రామస్తులు సందడి చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. యండగండి గ్రామంలో సంక్రాంతి సంబరాలు, మహిళలకు ముగ్గుల పోటీలు జరిపారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

ఫోటో: 13కెపీటీ 2 రైటప్: కొత్తపేట మండలం వాడపాలెంలో ఎమ్మెల్యే బండారు స్వగృహం వద్ద భోగిమంటలు వేసి పూజ చేస్తున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో భోగి పండుగ

కొత్తపేట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాలలో ముందుగా వచ్చే భోగి పండుగను సోమవారం అందరు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ముఖ్యకూడలిలో భోగి మంటలు వేసి ఆవుపేడ పిడకల దండలను చిన్నారులు వేశారు. భోగిపళ్ళు సమర్పించి పూజలు చేశారు. అలాగే కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్వగ్రామం వాడపాలెంలో కుటుంబ సభ్యులతో కలిసి భోగి పండుగను ఆచరించి భోగి మంట వేశారు.

రావులపాలెం: మండలంలోని ఆయా గ్రామాల్లో భోగి పండుగను ఘనంగా జరిపారు. ఆయా ప్రాంతాల్లో తెల్లవారుజామునే ముఖ్య కూడళ్ల వద్ద భోగి మంటలు వేశారు. గ్రామంలోని యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



భీమేశ్వరాలయంలో ఆశీర్వచనం పొందుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

భీమేశ్వరాలయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ పూజలు

ద్రాక్షారామ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని సోమవారం గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు సతీసమేతంగా సందర్శించారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. దర్శనం అనంతరం బేడా మండపంలో ఆయనకు వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.

ఘనంగా రాజేశ్వరి అమ్మవారి జాతర

కపిలేశ్వరపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న శ్రీరాజేశ్వరి అమ్మవారి జాతర సోమవారం జరిగింది. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశా రు. అనంతరం అమ్మవారి జాతరను భాజాభజంత్రీలు, గరగనృత్యాలు, విచిత్ర వేషాలు, బాణాసంచా కాల్పుల మధ్య వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాయవరం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంటూరులో వేర్వేరు ప్రాంతాల్లో పేకాడుతున్న ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 7వేల 550 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. రాయవరం మండలంలో వివిధ ప్రాంతాల్లో కోడి పందాలు ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి నాలుగు కోళ్లు, నాలుగు కత్తులు, 3వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు, ప్రజా ప్రతినిధులు

సీఆర్సీలో సంక్రాంతి, వేమన జయంతి సంబరాలు

రావులపాలెం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రావులపాలెం పోతంశెట్టి రామిరెడ్డి పార్క్ వద్ద సీఆర్సీ సంక్రాంతి, వేమన జయంతి సంబరాలను ఏర్పాటు చేశారు. దీన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ పొలిట్‌ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజుతో కలిసి ప్రారంభించారు. తొలుత సీఆర్సీ రూపశిల్పి గొలుగూరి వెంకటరెడ్డి, అధ్యక్షులు తాడి నాగమోహనరెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి నాయకులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న సంబరాలను నాయకులు తిలకించారు.




రావులపాలెంలో కోడిపందాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. పక్క చిత్రంలో కొత్తపేటలో పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు ప్రారంభిస్తున్న దృశ్యం



ఆత్రేయపురంలో కోడిపందాలు నిర్వహిస్తున్న దృశ్యం

యథేచ్ఛగా కోడి పందాలు

• పోలీసుల హెచ్చరికలు పట్టించుకోని పందెంరాయుళ్లు • చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు

ఆత్రేయపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పోలీసుల హెచ్చరికలను ఏ మాత్రం పట్టించుకోకుండా కోడిపందాలు యథేచ్ఛగా జరిగిపోతున్నాయి. ఇప్పటికే పందెంరాయళ్ళు ఆయా ప్రాంతాల్లో వాలిపోయారు. మండలంలోని పేరవరం, వద్దిపర్రు, ఆత్రేయపురం, లొల్ల, తాడిపూడి, ర్యాలి గ్రామాల్లో కోడిపందాలు, గుండాటలు జోరుగా సాగాయి. తొలిరోజు పందాల్లోనే లక్షలాది రూపాయలు చేతులు మారాయి. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

ఆత్రేయపురం: మండలంలోని పలు ప్రాంతాల్లో కోడిపందాలు యథేచ్ఛగా జరిగాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల కోడిపందాల బరిలో గెలిచిన వారికి రెండు బుల్లెట్లు ఇచ్చేందుకు నిర్వాహకులు సన్నద్ధమయ్యారు. పందెం బరి వద్ద బుల్లెట్లు ప్రదర్శనగా నిలిపారు. జోడి పందాల్లో గెలిచిన విజేతకు బుల్లెట్ అందించేలా రెండు జోడి పందాలు వేసేందుకు నిమగ్నం కావడంతో యువత పోటీ పడుతున్నారు. జోడి పందెం గెలుచుకో...బుల్లెట్ సొంతం చేసుకో అంటూ బరి వద్ద మైకులో ప్రచారం చేస్తున్నారు.

రావులపాలెం: రావులపాలెంలో కోడిపందాల బరుల వద్ద ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోడిపుంజులను పట్టుకుని ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, సీఆర్సీ అధ్యక్షులు తాడి నాగమోహన్‌రెడ్డి, చిన్న కేవీ, కోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా గుండాటలు

కొత్తపేట: మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం పెద్దఎత్తున కోడిపందాలు నిర్వహించారు. తొలుత వీటిని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రారంభించగా తరువాత పెద్దఎత్తున పందాలు నిర్వహించారు. బరి ప్రాంగణంలో గుండాటలు, జూదాలు నిర్వహించారు. పోలీస్ అధికారులు బరిలు వంక కనీసం కన్నెత్తి చూడలేదు.

రావులపాలెం: అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చేసిన పోలీసుల పందెంరాయుళ్ల పట్టించుకోలేదు. మండలంలో కోడిపందాలు, గుండాట వంటివి యథేచ్ఛగా జరిగాయి. రావులపాలెం, రావులపాడు, ఈతకోట, దేవరపల్లి, గోపాలపురంతో పాటు పలు గ్రామాల్లో కోడిపందాలు, గుండాట జోరుగా జరిగాయి.

ముక్కామలలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

పలువురికి తీవ్ర గాయాలు

అంబాజీపేట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ముక్కామల హైస్కూల్ సమీపంలో రెండు సామాజిక వర్గాల మధ్య సోమవారం సాయంత్రం ఘర్షణ జరిగింది. ముక్కామల హైస్కూల్ సమీపంలో కోడిపందాలు, గుండాట శిబిరాలు ఏర్పాటు చేశారు. జనం భారీగా తరలివచ్చి మోటార్‌సైకిళ్లను రహదారిపై పార్కింగ్ చేశారు. దీంతో మోటారుసైకిళ్లు తప్పించే ప్రయత్నంలో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాలకు చెందిన వారు ఒకరిపైఒకరు దాడి చేసుకోవడంతో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు అక్కడకు చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టి ఘర్షణను అదుపుచేశారు. అక్కడ జరుగుతున్న కోడిపందాలు, గుండాటలను నిలుపుదల చేశారు. ఘర్షణ జరుగుతున్న సమయంలో పోలీస్‌కానిస్టేబుల్‌పై కొందరు యువకులు కేకలు వేసినట్లు స్థానికులు తెలిపారు. దీనికి సంబంధించి ఫిర్యాదులు వచ్చిన వెంటనే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు.

కోడి పందాల్లో విజేత ఆస్ట్రేలియావాసి

ఐ.పోలవరం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కోడి పందాల్లో ఆస్ట్రేలియాకు చెందిన జకీర్‌రాజ్ పాల్గొన్నారు. మురమళ్ళ కోడి పందాల కోసం రెండు రోజుల క్రితం ఆయన ఇండియాకు వచ్చారు. కోడి పందాల్లో జకీర్‌రాజ్ కోడి గెలిచింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆయనకు మెమెంటో అందజేశారు.



2009 బ్యాచ్‌కి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు సందడి చేసిన దృశ్యం

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

కె.గంగవరం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 2009లో పదవ తరగతి చదివిన వారంతా పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. చిన్ననాటి స్నేహితులతో సంతోషంగా గడుపుతూ, ఆటపాటలు, విందు భోజనాలు చేశారు. విద్యార్థులకు జ్ఞాపికలు పంపిణీ చేశారు.

ఉండవిల్లి వంశస్తుల సంక్రాంతి సందడి

రాయవరం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామానికి చెందిన ఉండవిల్లి వంశస్తుల సంక్రాంతి వేడుకలు సోమవారం అట్టహాసంగా సాగాయి. రాయవరం గ్రామానికి చెందిన టీడీపీ నేత ఉండవిల్లి రాంబాబు ఆధ్వర్యంలో చెన్నై, బెంగళూరు, హైదరాబాదుతో పాటు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా రాయవరంలో భోగి పండుగను జరుపుకున్నారు. తమ స్వగ్రామంలో సంక్రాంతిని జరుపుకోవాలనే కోరికతో ఇక్కడకు వచ్చి వేడుకలు జరుపుకున్నట్లు రాంబాబు తదితరులు తెలిపారు.



రాయవరంలో ఒకేచోట కలిసిన ఉండవిల్లి వంశస్తులు